# కీడు చేసిన మేలు

## — కె. శైలజ —

కూతురు వాలకం చూసి-కృష్ణమూర్తి గారు విస్తుపోయారు...ఏదో పెద్ద షాక్ తిన్నట్లు బాధపడుతూ, ముకళించుకుపోయిన మొహంతో బరువుగా అడుగులు వేస్తూ, చావిడిలో వున్న తండ్రిని గుర్తించకుండానే మేడమీదకు వెళ్లిపోయింది శ్యామల. కాలేజీకి వెళ్ళేటప్పుడు నవ్వు మొహంతోనే వెళ్ళిన శ్యామల తిరిగి ఇంటికొచ్చేసరికి విచారంగా ఎందుకుందో-ఎంత ఆలోచించినా ఆయనకు అంతుపట్టలేదు. అప్రయత్నంగా నిట్టూర్చి సోఫాలో కూలబడ్డారాయన.

మేడమీదకు వెళ్ళిన శ్యామల, చేతిలో వున్న పుస్తకాలను టేబుల్ మీదకు గిరాటేసి మంచంమీద వాలిపోయింది. ఆమెలో కోపం ఉప్పెనగా పొంగుతోంది; దుఃఖం పరవళ్ళు తొక్కుతోంది. అందాలు చిందులాడే ఆమె ముఖం-ఆ ఉద్రిక్త పరిస్థితిలో అరుణరాగ రంజితమైంది. ఆమె మనస్సంతా అతలాకుతలమైపోతోంది... ఏదో నిస్సహాయత, అంతకు మించిన కసి ఆమె శరీరాన్ని జలదరింప జేస్తున్నాయి. ఆమె బలవంతంగా వెనక్కి నెట్టేస్తున్న కొద్దీ కాలేజీ ఆమె కళ్ళ ముందు లాస్యం చేస్తోంది.

క్లాసులో తెలివైన విద్యార్థి-మనిషి మిక్కిలి మంచివాడని తను రామం దగ్గర ఫిజిక్స్ నోట్సు తీసుకుంది; రెండు మూడుసార్లు తనతో పాఠాల విషయమై ప్రసంగించింది. అంతే-అంతకు మించి తప్పేం చెయ్యలేదు. దీనికి చిలవలు పలవలు అల్లి కాలేజీ అంతా నీచాతి నీచమైన పుకారు లేవదీశారు కొంటె విద్యార్థులు. తన పేరూ, రామం పేరు కాలేజీగోడల నన్నిటినీ అలంకరించాయి. క్లాసులో బల్లలు బ్లాక్ బోర్డులే గాక-ప్రిన్సిపాల్ గారి ఆఫీసురూమ్ తలుపులపై కూడా ఈ పేరెక్కాయి. కాలేజీ అంతా అట్టుడికినట్టుడికి పోయింది, ఈవిషయంతో. తనే పాపం ఎరక్కపోయినా నలుగుర్లో తలవంపులైంది.

ఏ విద్యార్థి నోటవెంబడి విన్నా తన పేరే వినవస్తోంది అందరూ తనవంక హేళనగా చూస్తున్నారు; తనరాకను గమనించి ఏవేవో గుసగుసలాడుకొంటున్నారు; వ్యంగ్యంగా నవ్వుతున్నారు. ఇదంతా తల కొట్టేసినట్లుంది తనకు. తనను ఎన్నెన్ని విధాలుగానో 'రోడ్డు సైడు రోమియోలు'-రెచ్చగొట్టడానికి ప్రయత్నించేవారు; అయినా వాళ్ళకి తను జడిసిందా? ఒక తీక్షణమైన వీక్షణం వాళ్ళమీదకు ప్రసరింపజేసేది. అంతే—వాళ్ళంతా పిల్లులైపోయి, కిమ్మనకుండా తనవెంట వచ్చేవారు—బాడీగార్డుల్లా!!—వాళ్ళు ఎన్నెన్ని వెకిలి వేషాలేసినా, దస్తాల తరబడి ప్రేమలేఖలు రాసినా తాను కించిత్తుకూడా చలించలేదే? అంత జాగ్రత్తగావున్న తనమీద ఈ అభాండం పడటం చాల శోచనీయమైన విషయం. తనవలన భంగపడిన కొంటె విద్యార్థులే ఈపని చేసి ఉంటారు.

ఈవిధంగా శ్యామల తలపోస్తూ ఉండగా—ఆమె తల్లి అన్నపూర్ణమ్మ ఆగదిలోకొచ్చింది.

"అదేవిటే అమ్మడూ, అలా వున్నావ్?" ఆదుర్దాగా అడిగింది. త్రుళ్ళిపడింది శ్యామల. "కళ్ళ నీళ్లు పెడుతున్నావేం, శ్యామలా?" ఆతల్లిహృదయం ఆందోళన పూరితమైంది

"అహా, ఏం లేదు" ముక్తసరిగా శ్యామల అంది.

"ఏదో బాధపడుతూనే ఏం లేదంటావేవిటి?" కొంచెం కోపం ధ్వనించింది కంఠంలో, శ్యామల మంచంమీదనుంచి లేచిపోయింది. "నాకంట్లో బావుండలేదమ్మా; అంతకు తప్ప మరేం లేదు" అంది విసుగ్గా.

"వంట్లో బావుండలేదా?" ప్రశ్నించింది అన్నపూర్ణమ్మ.

"అవును తలనొప్పిగా ఉంది." తల్లి కళ్లలోకి, చూస్తూ అంది.

"అయితే మధ్యాహ్నం - కాలేజీకి వెళ్లవా?"

"వెళ్ళను."

"సరే...భోజనం చేద్దువుగాని రా."

భోజనం చెయ్యనంటే తల్లి అనుమానిస్తుందని, ఇష్టం లేకపోయినా అందు కంగీకరించింది. ఇద్దరూ మేడదిగి క్రిందికొచ్చారు.

"ఏవమ్మా శ్యామా, అలా ఉన్నావ్?" చావిడిలో వున్న కృష్ణమూర్తిగారు ప్రశ్నించారు. "తలనొప్పిగా ఉంది నాన్నగారూ!" అంది తండ్రివంక చూడకుండానే. ఆమె కంఠస్వరం కృత్రిమంగా ఉంది. తన కూతురు అంతర్గతంగా ఏదో బాధపడుతోందని తెలుసుకొని, తనలో తానే విచారపడ్డాడాయన.

ఆ సాయంత్రం కాలేజీకి వెళ్ళకపోవడం వలన శ్యామలకు ఫిజిక్సు క్లాసు పోయింది. మేడమీది గదిలో ఒంటరిగా కూర్చొని. ఫిజిక్స్ పాఠాలు తిరగేస్తోంది శ్యామల. ఆమె కళ్లు పుస్తకంమీదే వున్నా-మనస్సు మాత్రం ఎటో కళ్లెం తెగిన గుఱ్ఱంలా పరుగులిడుతోంది.

ఇంతలో క్రిందనుంచి తల్లి పిలుస్తూ ఉండడంవల్ల శ్యామల వెళ్ళింది.

"ఏవిటమ్మా, పిల్చావ్?" అంది.

'ఎవరో పిల్లవాడొచ్చి నీవు కావాలంటున్నాడు; ఏదో పుస్తకం తెచ్చాడు," అని తల్లి చెప్పింది. శ్యామల ఆశ్చర్యపడుతూనే బయట వరండాలోకి వెళ్ళింది.

"ఎవరబ్బాయ్, నువ్వు?" అడిగింది.

"మా అన్నయ్య మీ కీపుస్తకం ఇచ్చి రమ్మన్నాడండి" అంటూ పుస్తకాన్ని అందిచ్చాడు ఆమెకు. పుస్తకం వంక తేరిపార జూసింది శ్యామల...అది ఫిజిక్స్ నోట్సు... దానిమీద రామం పేరుంది. ఆమె ఏదో అందామని నోరు విప్పి-తలెత్తి చూసేసరికి ఆకుర్రాడక్కడ లేడు. ఆమె నిట్టూర్చి ఆ పుస్తకాన్ని తీసుకొని మేడమీదకు వెళ్ళిపోయింది. మంచంమీద కూర్చొని నోట్సు తెరిచింది. లోపల్నుంచి ఆకు పచ్చరంగు కాగితమొకటి ఆమెవళ్లో పడింది ఆదుర్దాగా దాన్ని తెరిచి చూసింది శ్యామల.

అందులో ఇలా ఉంది. "శ్యామల గార్కి; నమస్కారములు. మీరు సాయంత్రం కాలేజీకి రాకపోవడం వలన ఇంపార్టెంటైన ఫిజిక్స్ లెసన్ పోయింది. అయినా విచార పడకండి. నేను పంపిన నోట్సు ఉపయోగించుకోండి.

శ్యామలగారూ! మీమీదా, నామీదా ఏవేవో కట్టుకథలల్లి ప్రచారం సాగిస్తున్నారు కాలేజీలోని కొంటె విద్యార్థులు. ఆ ప్రచారంలో ఎంత సత్యముందో పైనున్న ఆభగవంతునకు మన అంతరాత్మలకు మాత్రమే తెలుసు. నిజంనిప్పువంటిది. శ్యామలగారూ! అదిప్పుడు నివురుగప్పినా - మరొకప్పుడైనా

# ★ కీడు చేసిన మేలు ★

ప్రకాశిస్తూ బయటకు రాకపోవచ్చు. మనవల్ల ఏ తప్పూ లేనప్పుడు బాధపడడం అనవసరం. మీరు నిశ్చింతగా ఉండండి. మీరు బాధపడుతున్నట్లు కనుపిస్తే, దుష్టశక్తులు ద్విగుణీకృతోత్సాహంతో పురోగమిస్తాయి. కనుక మీరు సాధ్యమైనంతవరకు నిబ్బరం అలవరచుకోండి. నాకు తెలియకుండానే నావల్ల మీకేమైనా ఆపద వాటిల్లివుంటే, నన్ను హృదయపూర్వకంగా క్షమించండి.

మీకీ విధంగా లేఖ రాసినందుకు, అన్యథా భావించకండి. రేపొద్దుట మా తమ్ముడొస్తాడు, ఫిజిక్స్ నోట్సు అతని కివ్వండి.. కాలేజీకి తీసుకురావద్దు—

సెలవు,

మనఃపూర్వక అభినందనలతో, రామం."

తనకు తెలియకుండానే యాంత్రికంగా ఆ జాబును అనేకసార్లు చదివింది శ్యామల. తన యందలి ఔదార్యంతో నోట్సు పంపినందుకు రామాన్ని మనసారా అభినందించింది. అతని విశాల హృదయాన్ని కొనియాడింది. ఆ లేఖ చదివాక ఆమె మనస్సు కాస్త తేలిక పడింది.

దీర్ఘనిశ్వాసం విడిచి ఫిజిక్స్ నోట్సు రాయనారంభించింది. ఒక అరగంటలో నోట్సు రాయడం ముగించి ఏదో కూనిరాగం తీస్తూ గదిలో అటూ-ఇటూ పచార్లు చెయ్యసాగింది. ఏదో అవ్యక్తమైన ఆనందం ఆమెను ముప్పిరిగొంది. కూతురు మొహం చిరునవ్వుతో కలకల్లాడుతుండడం చూసి అన్నపూర్ణ సంబరపడింది; కృష్ణమూర్తిగారు కూడా ఆనందించారు.

ఆ మర్నాడు ప్రొద్దుటే రాజశేఖరంగారు శ్యామల ఇంటికొచ్చారు. ఆయన-శ్యామల చదువుతున్న కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్. కృష్ణమూర్తిగారి స్నేహితుడు. కాఫీ ఫలహారాల అనంతరం ఇష్టాగోష్ఠిలో పడ్డారు ఉభయులు.—వారి మాటల్లో కాలేజీ ప్రసక్తి వచ్చింది. కాలేజీలో జరిగిన పుకార్లు గురించి సవిస్తరంగా వివరించి చెప్పారు రాజశేఖరంగారు, కృష్ణమూర్తి గారికి. క్రితం రోజు శ్యామల ఎందుచేత బాధపడిందో కృష్ణమూర్తిగారి కిప్పుడు అవగాహనమైంది. ఆయనకు తన కూతురు మీద ఏనాడు అపనమ్మకం లేదు. పురుషులంటే—అందులో యువకులంటే, తన కూతురు ఎంత దూరదూరంగా తొలగి తొలగి ఉంటుందో—ఆయనకు తెలియని విషయం గాదు. అయినా ఆయన ఆలోచిస్తున్నారు అపుకార్ల గురించి. అసలు—నిప్పంటూ లేందే పొగరాదుగదా. ఇదే ఆయన ఆలోచనలంతా.

తన కూతురొక వేళ నిజంగానే రామాన్ని. ఏమో ఎందుక్కూడదు? మనస్సులో ప్రేమ జనించాలంటే ఎంతసేపు, ఒక్క విఘడియచాలు.

"ఏమిటోయ్, ఆలోచిస్తున్నావ్?"... రాజశేఖరం ప్రశ్నించాడు.

కృష్ణమూర్తిగారు తేరుకొని, "ఇంతకీ ఆరామం ఎవరోయ్, శేఖరం?" కుతూహలంగా అడిగారు. లెక్చరర్ గారు పకపకానవ్వారు.

"అరి నీ అసాధ్యం గూలా; అతన్నే ఎరుగవోయ్?" అన్నారు వ్యంగ్యంగా. ఎరుగనట్లు తలపంకించారు కృష్ణమూర్తిగారు.

"అతనెవరో కాదు—జడ్జీ దేవేశ్వర్రావు గారబ్బాయే!" చిరునవ్వుతో అన్నారు.

"ఆఁ!" అని నోరు తెరచారు కృష్ణమూర్తిగారు సంభ్రమాశ్చర్యాలతో. దేవేశ్వర్రావుగారు-ఆయనకు బాగా తెలిసినవారే, మెరుపులాంటి ఆలోచన వచ్చింది కృష్ణమూర్తిగారికి. ఆయన మొహం సంతోషంతో విప్పారింది. "రైటో...!" అంటూ ఆయన చిటిక వేశారు.

చిరునవ్వు పెదవులలోనే కప్పిపుచ్చుకొని రాజశేఖరం గారన్నారు:

"అదేమిటో నాకూడా చెప్పవోయ్, విని ఆనందిస్తాను."


కృష్ణమూర్తిగారు పెద్ద పెట్టున నవ్వేశారు. "అబ్బ ఏం నంగనాచివోయ్! అన్నారు. "ఈ విషయం గురించి నీవు దేవేశ్వర్రావుగారికి రికమెండ్ చేస్తే మరీ మంచిది ఏమంటావ్?...ఆయన వెంటనే అంగీకరిస్తారు కదూ!"

"హారి పిడుగా!...వదిత్తే వేశావ్; జడ్జీగారి కోడల్ని చెయ్యబోతున్నానన్నమాట మీ అమ్మాయిని?".. సౌజన్యం వెల్లివిరిసేటట్లు నవ్వారు కృష్ణమూర్తిగారు.

"వూ, కానియ్ ... శుభస్య శీఘ్రం అన్నారు." ఇరువురూ కలిసి హాయిగా, స్వేచ్ఛగా నవ్వుకున్నారు.

లోపల తలుపు ప్రక్కనే దాగి-ఈ మాటలన్నీ శ్యామల వింటోందని వాళ్ళు గ్రహించనే లేదు.

ఆ సంభాషణ విని, శ్యామల మొహం ఈసారి ప్రణయ రాగరంజితమైందని వేరే చెప్పనక్కర్లేదు! ★



ఆంధ్రదేశంలో ప్రఖ్యాతినొందిన శ్రీ నాజర్ శిష్యులు, బుర్రకథ బృందం ఈ మధ్య మద్రాసులో 'పల్నాటియుద్ధం' బుర్రకథ చెప్పారు. ఈ చిత్రంలో కథకులు: శ్రీ లక్ష్మణరావు; రాజకీయం: శ్రీ శత్రుఘ్నరావు, హాస్యం: శ్రీ హనుమంతరావు.





నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము నీక్షాక, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి రు 1-1-0

పి. పి. ఎ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)

పెరిదేపి (పోస్టు) — నెల్లూరు జిల్లా.